# పోలీస్ నియామకాలు చేపట్టండి

- పోలీస్, ఆర్టీసీ ఉద్యోగుల పిల్లల కోసం ప్రత్యేక రెసిడెన్షియల్ స్కూళ్లు
- ప్రతి నెలా రెండుమూడు రోజులు గ్రామ సభల నిర్వహణ
- ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల స్టేటస్ తెలపాలి
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు

హైదరాబాద్, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ): పోలీస్ నియామక ప్రక్రియను వెంటనే చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం పోలీస్, వైద్యారోగ్య శాఖల్లో నియామకాలపై సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. పోలీస్ శాఖలో ఏడెనిమిదేండ్లుగా నిలిచిపోయిన హోంగార్డుల నియామకాలను చేపట్టాలని డీజీపీని ఆదేశించారు. హోంగార్డుల ఆరోగ్యం, ఆర్థిక, వైద్య అవసరాలు తీరేలా తగు చర్యలు చేపట్టాలని, హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు వారి సేవలను విస్తృత స్థాయిలో ఉపయోగించుకోవాలని సూచించా రు. ఉద్యోగ నియామకాలను పారదర్శకంగా, అవకతవకలకు ఆస్కారం లేకుండా చేపట్టాలని స్పష్టంచేశారు. నియామకాల ప్రక్రియలోని లోటుపాట్లు, వాటిని అధిగమించే అంశాలపై సవివరమైన నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటివరకు జరిగిన ఉద్యోగ నియామకాలపై కూడా నివేదిక ఇవ్వాలని కోరారు. పోలీస్, ఆర్టీసీ ఉద్యోగుల పిల్లల కోసం కోరుకొండ సైనిక్ స్కూల్ మాదిరిగా ప్రత్యేక రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటుచేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఉత్తర, దక్షిణ తెలంగాణలో వీటిని ఏర్పాటు చేయాలని చెప్పారు.

### మాజీ డీఎస్పీ నళినికి అదే ఉద్యోగం?

తెలంగాణ ఉద్యమ సమయంలో ఉద్యోగానికి రాజీనామా చేసిన డీఎస్పీ నళినికి పోలీస్ శాఖలో తిరిగి అదే ఉద్యోగం ఇచ్చే అవకాశాలను పరిశీలించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. నళినికి ఉద్యోగం చేయాలనే ఆసక్తి ఉంటే వెంటనే ఉద్యోగంలోకి తీసుకోవాలని సీఎస్, డీజీపీని ఆదేశించారు. పోలీస్‌శాఖలో మార్గదర్శకాలకు సంబంధించి అవరోధాలేమైనా ఉంటే, అదే హోదాలో ఇతర శాఖలో ఉద్యోగం ఇవ్వాలని సూచించారు.

**విజ్ఞప్తులకు ప్రత్యేక సమయం**

సచివాలయానికి వచ్చే ప్రజలు తమ సమస్యలను విన్నవించుకోవడానికి మంత్రుల చాంబర్స్‌లో నిర్దిష్టమైన సమయం, ప్రత్యేక అనుమతులు కల్పించేందుకు అధ్యయనం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. ప్రజలు హైదరాబాద్ వరకు రాకుండా, ప్రతి నెలా రెండు రోజులపాటు పట్టణాలు, గ్రామాల్లో సభలు నిర్వహించి, వారి సమస్యలు అక్కడే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విజ్ఞప్తులు, ఫిర్యాదులను డిజిటలైజ్ చేయాలని, వాటి స్టేటస్‌ను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయాలని చెప్పారు. ప్రజాభవన్‌లో నిర్వహిస్తున్న ప్రజావాణికి అద్భుతమైన స్పందన వస్తున్నందున ఫిర్యాదుల స్వీకరణకు టేబుల్స్ పెంచాలని, కనీస అవసరాలు కల్పించాలని సూచించారు. వచ్చేవారికి ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని స్పష్టంచేశారు. శిక్షణలో ఉన్న ఐఏఎస్‌ల సేవలను కూడా వినియోగించుకోవాలని సూచించారు.

**కాన్వాయ్‌తో ప్రజలకు ఇబ్బంది రానివ్వొద్దు**

సీఎం కాన్వాయ్ వెళ్తున్న సమయంలో సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ఇప్పటికే కాన్వాయ్‌లోని 15 వాహనాలను 9కి తగ్గించామని చెప్పారు. ప్రజా సమస్యలను స్వయంగా తెలుసుకోవడానికి విస్తృత స్థాయిలో పర్యటిస్తానని, తాను ప్రయాణించే మార్గాల్లో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. సమావేశంలో వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, సీఎస్ శాంతికుమారి, డీజీపీ రవిగుప్తా, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ శ్రీనివాసరావు, ప్రభుత్వ కార్యదర్శులు రిజ్వి, శ్రీదేవి, సీఎంవో అధికారులు శేషాద్రి, శివధర్ రెడ్డి, షానవాజ్ కాసీం, హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు కార్యదర్శి గోపీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



## కశ్మీర్ జింకలపై సీసీఎంబీ అధ్యయనం

### జన్యుక్రమాన్ని నమోదు చేసిన పరిశోధకులు

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ): కశ్మీర్ వ్యాలీలో అరుదైన వన్య ప్రాణిగా గుర్తింపు ఉన్న రెడ్ స్టాగ్(హంగుల్) జింకలపై హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ సెల్యూలర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) అధ్యయనం చేసింది. జింకల జనాభా, జీవావరణం, సంతతిని పెంచే అంశాలపై శాస్త్రీయంగా విశ్లేషించింది. కశ్మీర్ లోయలోని చీనాబ్ నదీ తీరంలో ఎక్కువగా సంచరించే ఈ జింకలపై సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ అనురాధారెడ్డి నేతృత్వంలో అధ్యయనం చేశారు. జమ్ములోని దాచిగాం జాతీయ పార్కులో వీటిని సంరక్షిస్తుండగా, 1990లో వీటి సంఖ్య 5వేలుగా ఉండేదని గుర్తించారు. వీటి సంతానోత్పత్తికి అవసరమైన మగ జింకల సంఖ్య 12లోపే ఉందని తేల్చారు. 14 మైక్రో శాటిలైట్ మేకర్ల ద్వారా 293 రెడ్ స్టాగ్ మల వ్యర్థాల ను పరిశోధించి వాటి జన్యు క్రమాన్ని, వాటి సంఖ్యను తేల్చారు. రుతుక్రమాలకు అనుగుణంగా వలస వెళ్లే ఈ జాతి జింకలు లోతట్టు, కొండ ప్రాంతాల్లోనే నివాసం ఉంటాయని, ఈ సమయంలోనే ఎక్కువగా సంతానోత్పత్తి చేస్తుంటాయని పేర్కొన్నారు. వీటి సంపర్కం కూడా సెప్టెంబర్–నవంబర్ మధ్యలో ఎక్కువగా ఉంటుందని గుర్తించారు. తమ పరిశోధన ద్వారా వాటి సంతానోత్పత్తిని పెంచడానికి వీలు పడుతుందని, అంతరించిపోకుండా వాటిని కాపాడుకోవచ్చని తెలిపారు. సీసీఎంబీ పరిశోధకులు చేసిన అధ్యయనాన్ని కేంబ్రిడ్జి ప్రెస్ జర్నల్ ప్రచురించింది.

## 19న వీఐపీ బ్రేక్ దర్శనం రద్దు

హైదరాబాద్, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ): తిరుమల శ్రీవారి ఆలయంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఈ నెల 23 నుంచి జనవరి 1వ తేదీ వరకు వైకుంఠ ద్వార దర్శనానికి ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల్లో భాగంగా 19న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నందున ఆ రోజు వీఐపీ బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దు చేసింది. ఈ కారణంగా 18న సిఫారసు లేఖలు స్వీకరించబోమని అధికారులు తెలిపారు. శుక్రవారం రాత్రి 12.34 గంటలకు ధనుర్మాసం ప్రారంభం కానున్నందున టీటీడీ స్థానిక ఆలయాల్లో ఈ నెల 17 నుంచి జనవరి 14 వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ధర్మప్రచారంలో భాగంగా వేద సారాన్ని ప్రజలకు తెలిపేందుకు 2024, ఫిబ్రవరి మొదటి వారంలో సహస్రపురుష వేద స్వస్తి చతుర్వేద పారాయణం నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఇందుకోసం ఏర్పాట్లు చేపట్టాలని టీటీడీ జేఈవో సదాభార్గవి అధికారులను ఆదేశించారు.

**తిరుమలను కమ్మేసిన పొగమంచు.. రాకపోకల నిలిపివేత**

తిరుమలను పొగమంచు కమ్మేసింది. శుక్రవారం తెల్లవారుజాము నుంచి దట్టమైన పొగమంచు కారణంగా ఘాట్‌రోడ్లలో సొంత వాహనాల్లో ప్రయాణించే వారిని అలిపిరి వద్ద టీటీడీ సిబ్బంది అప్రమత్తం చేశారు. రహదారి మరమ్మతులు కొనసాగుతున్న చోట జాగ్రత్తగా వెళ్లాలని సూచిస్తున్నారు. పొగమంచు, వర్షం కారణంగా పాపవినాశనం, శ్రీవారి మెట్ల మార్గాలను తాత్కాలికంగా టీటీడీ మూసివేసింది. ఈ మార్గాల్లో వాహనాల రాకపోకలను శుక్రవారం సాయంత్రం నుంచి నిలిపివేశారు.

### ఏపీ సీఎం జగన్‌కు మరోసారి నోటీసులు

హైదరాబాద్, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ): ఆదాయానికి మించి ఆస్తుల కేసుల్లో ఏపీ సీఎం జగన్‌కు తెలంగాణ హైకోర్టు మరోసారి నోటీసులు జారీచేసింది. మాజీ మంత్రి హరిరామ జోగయ్య దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యంపై శుక్రవారం విచారణ జరిగింది. గతంలో జారీచేసిన నోటీసులు అందకపోవడంతో జగన్‌తోపాటు సీబీఐ, ఈడీకి నోటీసులు జారీచేసిన ధర్మాసనం.. తదుపరి విచారణను 3 నెలలకు వాయిదా వేసింది.

### మిర్చి రైతు ఆత్మహత్య

మంగపేట, డిసెంబర్ 15 : ఉమ్మడి వరంగల్ జిల్లాలో మరో మిర్చి రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ములుగు జిల్లా మంగపేట మండలం తిమ్మంపేటకు చెందిన పోకల పుల్లయ్య(50) అనే రైతు మల్లూరు తనకున్న మూడున్నర ఎకరాల్లో ఇన్నేండ్లుగా వరి సాగు చేసేవాడు. ఈ ఏడాది మిరప వేశాడు. తుఫాను కారణంగా చెట్లన్నీ చనిపోయాయి. పెట్టుబడి కోసం తీసుకొచ్చిన అప్పులు తీర్చలేనేమోనన్న బెంగతో పుల్లయ్య గురువారం సాయంత్రం పొలం వద్ద గడ్డి మందు తాగగా, చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మరణించాడు.

## కటాఫ్‌లు.. కొర్రీలపై భిన్నాభిప్రాయాలు!

- క్యాబినెట్‌లో వాడివేడి చర్చ

హైదరాబాద్, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ఇచ్చిన ఎన్నికల హామీలు రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి మించి ఉన్న నేపథ్యంలో వాటి అమలుపై క్యాబినెట్‌లో భిన్నాభిప్రాయలు వ్యక్తమైనట్టు సమాచారం. గురువారం అసెంబ్లీ హాల్‌లో క్యాబినెట్ సమావేశం జరిగింది. వాస్తవానికి గవర్నర్ ప్రసంగానికి ఆమోదం తెలిపే సమావేశం సాధారణంగా అరగంటలో అయిపోతుంది. కానీ.. గురువారం దాదాపు గంటన్నరపాటు సాగింది. ఈ సందర్భంగా ఆరు గ్యారెంటీల అమలుకు అయ్యే ఖర్చులపై మంత్రివర్గం లెక్కలు వేసినట్టు సమాచారం. అన్నీ అమలు కావాలంటే ప్రస్తుత బడ్జెట్ కంటే మూడింతల నిధులు కావాలని తేలినట్టు విశ్వసనీయంగా తెలిసింది. దీంతో పథకాల అమలులో కొర్రీలు పెట్టాలని కొందరు సూచించినట్టు సమాచారం. రైతుబంధు 5 ఎకరాల లోపువారికే ఇవ్వాలని, మహాలక్ష్మి పథకంలోనూ కోతలు పెట్టాలని, బస్సుల సంఖ్య తగ్గించి నష్టాన్ని నివారించాలని సూచనలు వచ్చినట్టు తెలిసింది. అయితే అందరికీ, అన్నీ ఉచితంగా ఇస్తామని చెప్పి ఇప్పుడు కొర్రీలు పెట్టడం కరెక్ట్ కాదని ఇద్దరు, ముగ్గురు మంత్రులు సూచించినట్టు సమాచారం. లెక్కలు వేసుకోకుండా ఎన్నికల్లో హామీలు ఎందుకు ఇచ్చారని ఎదురు ప్రశ్నించినట్టు తెలిసింది. ఈ వాదన కాస్త సీరియస్‌గా సాగుతుండటంతో మరో మంత్రి కలుగజేసుకుని శాంతిపజేసినట్టు చెప్పుకుంటున్నారు. సమావేశం రసాభాస అయ్యే సూచనలు ఉండటంతో మ్యానిఫెస్టో హామీలు, ఆరు గ్యారెంటీలపై చర్చను అర్ధంతరంగా ముగింపు పలికినట్టు తెలిసింది.

## కొత్త ఏజీగా వేణుగోపాల్?



హైదరాబాద్, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర అడ్వొకేట్ జనరల్‌గా పరాంకుశం వేణుగోపాల్‌ను నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలిసింది. నియామక సిఫార్సులు గవర్నర్‌కు పంపినట్టు, ఆమోదం కూడా తెలిపినట్టు న్యాయ వర్గాల్లో చర్చ నడుస్తున్నది. ఇప్పటివరకూ కొత్త ఏజీగా డీ ప్రకాశ్‌రెడ్డి, నిరూప్‌రెడ్డి, గిరిధర్‌రావు, మహేందర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి పేర్లు పరిశీలనలో ఉన్నాయనే ఊహాగానాల నేపథ్యంలో శుక్రవారం అనూహ్యంగా పీ వేణుగోపాల్ పేరు తెరపైకి వచ్చింది. తెలంగాణ ఏర్పాటు తర్వాత ఆంధ్రప్రదేశ్ సీఎంగా చంద్రబాబునాయుడు అధికారంలో ఉన్నప్పుడు ఏపీ హైకోర్టు అడ్వొకేట్ జనరల్‌గా వేణుగోపాల్ పనిచేశారు. వేణుగోపాల్ పూర్వీకులది ఒడిశాలోని బరంపురం. చాలా ఏండ్ల క్రితమే సికింద్రాబాద్‌లో స్థిరపడ్డారు. ఆయన 1954 నవంబర్ 23న జన్మించారు. సికింద్రాబాద్‌లోనే విద్యాభ్యాసం చేశారు. 1977లో ఓయూ నుంచి లా పూర్తి చేసి, అదే ఏడాది డిసెంబర్ 22న న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. సీనియర్ న్యాయవాది రంగనాథన్ వద్ద జూనియర్‌గా చేశారు. 1983– 1989 వరకు ప్రభుత్వ సహాయ న్యాయవాదిగా చేశారు. 2002లో హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా ఉన్నారు.

**తిరుపతి విమానాశ్రయంలో..**

## శ్రీవాణి దర్శన టికెట్ కౌంటర్ మార్పు

హైదరాబాద్, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ): దేశ విదేశాల నుంచి తిరుమల శ్రీవారి దర్శనానికి విచ్చేసే విమాన ప్రయాణికుల సౌకర్యార్థం తిరుపతి విమానాశ్రయంలో ప్రతిరోజు 100 ఆఫ్‌లైన్ శ్రీవాణి టికెట్లను టీటీడీ జారీ చేస్తున్న విషయం తెలిసిందే. అయితే విమానాశ్రయంలో శ్రీవాణి టికెట్ల జారీకి అనుమతి లేని కారణంగా శనివారం నుంచి విమానాశ్రయానికి బదులుగా తిరుమల గోకులం విశ్రాంతి భవనంలో జారీ చేయనున్నారు. ప్రతిరోజు 100 టికెట్లను బోర్డింగ్ పాస్ సమర్పించిన భక్తులకు యథావిధిగా శ్రీవాణి దర్శన ఆఫ్‌లైన్ టికెట్లను ఇవ్వనున్నట్టు టీటీడీ తెలిపింది.

## రాజధానిలో వీధికుక్కల స్వైరవిహారం

### రెండు చోట్ల దాడులు.. ఇద్దరు బాలలకు తీవ్రగాయాలు

దుండిగల్/ఎల్బీనగర్, డిసెంబర్ 15: హైదరాబాద్‌లో శుక్రవారం వేర్వేరు చోట్ల జరిగిన కుక్కల దాడుల్లో ఇద్దరు బాలలకు తీవ్ర గాయాలయ్యాయి. నిజాంపేట బండారి లేఅవుట్ కాలనీ పార్కుకు తల్లితో కలిసి వెళ్లి ఆడుకుంటున్న రెండున్నరేండ్ల బాలిక సోమశ్రీపై హఠాత్తుగా అక్కడికి వచ్చిన ఓ కుక్క దాడి చేసింది. ఈ దాడిలో చిన్నారి మెడపై తీవ్రగాయాలయ్యాయి. బాధిత బాలిక ప్రస్తుతం దవాఖానలో చికిత్స పొందుతున్నది. గడ్డి అన్నారం డివిజన్ శాంతినగర్‌లో ముగ్గురు చిన్నారులు ఆడుకుంటుండగా కుక్కల గుంపు వారిపై దాడి చేసింది. బాలలు ఓ ఇంటిలోకి వెళ్లగా వారి వెంటే పరిగెత్తి మరీ బిట్టు అనే ఐదేండ్ల బాలుడి కాలు కొరికి తీవ్రంగా గాయపర్చింది. ఈ ఘటనలతో నగరంలో వీధికుక్కల బెడదపై ఒక్కసారిగా ఆందోళన నెలకొన్నది.

